ప్రయాణికులకు ఇండిగో షాక్

ముందు వరుస సీట్ల కోసం రూ.2 వేల వరకు అదనపు చార్జీలు

న్యూఢిల్లీ, జనవరి 9: ఇండిగో విమానాల్లో ముందు వరుస సీట్లు కావాలంటే ప్రయాణికులు రూ.2,000 వరకు అదనంగా చెల్లించుకోవాల్సిందే. ఈ మేరకు సంస్థకు చెందిన వెబ్‌సైట్‌లో ఆయా సేవలకుగాను పేర్కొన్న ఫీజులు, చార్జీలనుబట్టి తెలుస్తున్నది. 232, 222 సీట్లుండే ఏ321 విమానాల్లోనైనా.. 186, 180 సీట్లుండే ఏ320 విమానాల్లోనైనా మొదటి వరుసలో విండో లేదా ఆస్లే సీటు కావాలంటే రూ.2,000 చెల్లించాలి. ఇప్పటిదాకా ఇది రూ.1,500 వరకు ఉన్నట్టు విమానయాన రంగ విశ్లేషకుడు అమేయ జోషి చెప్తున్నారు. ఇదిలావుంటే మధ్య సీటు కోసం రూ.1,500 ఇవ్వాల్సి ఉంటుందని సంస్థ పేర్కొంటున్నది. కాగా, ఏటీఆర్ విమానాల్లో ఈ చార్జీలు రూ.500 వరకు ఉన్నాయి. అయితే దీనిపై ప్రయాణికుల నుంచి, నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నా.. సంస్థ నుంచి మాత్రం ఎటువంటి స్పందనా లేదు. విమాన ఇంధన ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గత వారం దూరాన్నిబట్టి ఆయా రూట్ల టిక్కెట్లపై రూ.1,000 వరకు సంస్థ తగ్గించిన విషయం తెలిసిందే.

హైబిజ్ టీవీ రియాల్టీ అవార్డులు

హైదరాబాద్, జనవరి 9: రియాల్టీ అవార్డులను సైతం అందించడానికి సిద్ధమైంది హైబిజ్ టీవీ. ఇప్పటి వరకు మీడియా, సామాజిక వర్గాల్లో విశేష కృషి చేసిన వారికి అవార్డులు అందించిన హైబిజ్ టీవీ..తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలో విశేషంగా కృషి చేసిన వారికి తొలిసారిగా అవార్డులను అందిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచింది. ఇలా ఎంపికైనవారికి నెల 25న హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా అవార్డులను అందించనున్నది.

టీ హబ్‌లో ఈవీ బూట్ క్యాంప్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): టీ హబ్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉజ్వల భవిష్యత్ ఉన్న ఎలక్ట్రిక్ వాహన తయారీ రంగంలో వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన టెక్నాలజీ, తయారీ రంగానికి అవసరమైన ఉత్పత్తుల గురించి ఔత్సాహికులకు తెలియచేసేందుకుగాను టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నది. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఐదు రోజులపాటు ఈవీ బూట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నది. ఐఐఎం రాంచీతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు (https:// bit.ly/ 3NWsM3n)లో సంప్రదించాలన్నారు.

ఈ ఏడాది రూ.4 లక్షల కోట్ల ఐపీవో డీల్స్

ముంబై, జనవరి 9: ఈ సంవత్సరం ఐపీవోలు, సంబంధిత డీల్ మేకింగ్ కార్యకలాపాలు జోరుగా సాగుతాయని కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అంచనా వేస్తున్నది. 2021లో ఐపీవో డీల్స్ ద్వారా రికార్డుస్థాయిలో 50 బిలియన్ డాలర్ల (రూ.4.15 లక్షల కోట్లు) నిధుల సమీకరణ జరిగిందని, 2024లో ఈ స్థాయిని మించి లావాదేవీలు జరుగుతాయని అంచనా వేస్తున్నట్టు కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సీఈవో రమేష్ తెలిపారు. నవతరం టెక్ కంపెనీల నేతృత్వంలో ప్రైమరీ మార్కెట్ జోరు చూపిస్తుందన్నారు. ఈ సంవత్సరం మరిన్ని పెద్ద ఐపీవోలు మార్కెట్లోకి రావచ్చన్నారు.

ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్ ఇండియా లిమిటెడ్ సీఎండీ జాయ్ అలూక్కాస్‌ను 'హాల్ ఆఫ్ ఫేమ్-జెమ్స్ ఆఫ్ ప్రెస్టీజ్ అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా, జీజేఈపీసీ వైస్ చైర్మన్ కిరిట్ భన్సాలీ తదితరులున్నారు.

మూడేండ్లలో ఐదు కార్లు

మార్కెట్లోకి విడుదల చేయనున్న రెనో

న్యూఢిల్లీ, జనవరి 9: ఫ్రెంచ్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ రెనో..దేశీయ మార్కెట్లో మరింత పట్టు సాధించడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. వచ్చే మూడేండ్లకాలంలో దేశీయ మార్కెట్లోకి ఐదు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గతేడాది సంస్థ విక్రయాలు స్థబ్దుగా నమోదయ్యాయని, ఈసారి పుంజుకునే అవకాశం ఉన్నదని రెనో ఇండియా సీఈవో, ఎండీ వెంకట్రామ్ మామిల్లపల్లి తెలిపారు. 2023లో దేశీయంగా 49 వేల యూనిట్ల విక్రయాలు జరిపిన సంస్థ..28 వేల యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న మాడళ్లను ఆధునీకరించి విడుదల చేయనుండటంతో ఈ ఏడాది రెండంకెల వృద్ధి నమోదుకావచ్చునని చెప్పారు.

భారత్‌లో భారీ పెట్టుబడులు

యూరప్ బయట భారీ పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ఇటీవల రెనో ప్రకటించింది. భారత్‌తోపాటు ఇతర దేశాల్లో మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి 3 బిలియన్ల యూరోలను పెట్టుబడిగా పెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నిధులను కొత్త వాహనాలను తీర్చిదిద్దడానికి, రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. మరోవైపు వచ్చే ఐదేండ్లలో విడుదల చేయనున్న ఐదు నూతన మాడళ్లలో నెక్ట్స్ జనరేషన్ కైగర్, ట్రైబర్ ఉన్నాయి. దేశీయ మార్కెట్లోకి ఒకేసారి మూడు మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో రూ.4.69 లక్షలు మొదలుకొని రూ.10.99 లక్షల లోపు ధర కలిగిన క్విడ్, ట్రైబర్, కైగర్‌లు ఉన్నాయి. పాత వాటితో పోలిస్తే కొత్త వాటిలో పది అదనపు ఫీచర్స్ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజల అభిరుచులు మారుతున్నాయని, వారికి పెద్ద కార్లు, ఈవీ లేదా హైబ్రిడ్ కార్లపై ఆసక్తి చూపుతున్నారన్నారు.

చౌకైన ఆటోమేటిక్ కారు

దేశంలో అత్యంత చౌకైన ఆటోమేటిక్ కారు అందుబాటులోకి తీసుకొచ్చింది రెనో. ఇప్పటికే క్విడ్ మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన సంస్థ..తాజాగా ఈ మాడల్ ఆటోమేటిక్‌ను పరిచయం చేసింది. రూ.4.69 లక్షల నుంచి రూ.5.95 లక్షల మధ్యలో లభించనున్నది. దేశీయంగా లభిస్తున్న ఆటోమేటిక్ వెర్షన్లలో ఇదే తక్కువ ధర కలిగిన మాడల్ కావడం విశేషం. 14 అదనపు ఫీచర్స్‌తో రూపొందించిన ఈ మాడల్‌లో సీట్ బెల్ట్ రీమైండర్, ఎలక్ట్రానిక్ స్టేబులిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ వంటివి ఉన్నాయి. మారుతికి చెందిన ఎస్-ప్రెస్సో, ఆల్టో కే10 మాడళ్లకు పోటీగా సంస్థ ఈ మాడల్‌ను ప్రవేశపెట్టింది.

రెడ్‌మీ నోట్ 13 విడుదల

ప్రారంభ ధర రూ.29,999

హైదరాబాద్, జనవరి 9: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ.. రాష్ట్ర మార్కెట్లోకి రెడ్‌మీ నోట్ 13 సిరీస్ ఫోన్‌ను పరిచయం చేసింది. 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, మీడియాటెక్ హెలియో 9200+ ప్రాసెసర్, 108 మెగాపిక్సెల్+8 మెగాపిక్సెల్+2 మెగాపిక్సెల్ కెమెరా వంటి ఫీచర్లు ఉన్నాయి. 8జీబీ+256 జీబీ మెమోరీ కలిగిన మాడల్ ధర రూ.29,999గాను, 12జీబీ+256 జీబీ మెమోరీ కలిగిన మాడల్ ధర రూ.31,999, 12జీబీ+512 జీబీ మెమోరీ కలిగిన మాడల్ రూ.33,999గా నిర్ణయించింది. సెల్‌బే సంస్థ ఎండీ సోమ నాగరాజు, షియోమీ ఏపీ-టీఎస్ జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్ తదితరులు హాజరయ్యారు.

హోండా సిటీ ప్రియం

న్యూఢిల్లీ, జనవరి 9: కార్ల కొనుగోలుదారులకు హోండా ఇండియా షాకిచ్చింది. రెండు మాడళ్ల ధరలను రూ.58 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. సిటీ సెడాన్ ధర రూ.8 వేల వరకు సవరించింది. దీంతో ఈ మాడల్ ధర రూ.11.71 లక్షల నుంచి రూ.16.19 లక్షల మధ్యలోకి చేరుకున్నది. అలాగే ఎలివేట్ మాడల్ ధరను రూ.58 వేల వరకు సవరించింది.

నిఫ్టీ @ 23,500

ఈ ఏడాది చివరికల్లా.. టార్గెట్‌ను పెంచిన గోల్డ్‌మాన్ శాక్స్

న్యూఢిల్లీ, జనవరి 9: జీడీపీ వృద్ధి అంచనాలు మెరుగుపడటంతోపాటు వడ్డీ రేట్ల బాట పట్ల స్పష్టత రావడంతో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మాన్ శాక్స్ నిఫ్టీ-50 లక్ష్యాన్ని పెంచింది. ఈ ఏడాది చివరికల్లా 23,500 పాయింట్లకు చేరుతుందని తాజా అంచనాల్లో వెల్లడించింది. నవంబర్ నెలలో విడుదల చేసిన 21,800 పాయింట్ల లక్ష్యాన్ని కేవలం రెండు నెలల్లోనే పెంచింది. మంగళవారం నిఫ్టీ ముగింపు విలువ 21,545 పాయింట్లతో పోలిస్తే 2024 చివరినాటికి మరో 8.5 శాతం ర్యాలీని గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా వేస్తున్నది. గత రెండు నెలలుగా అంతర్జాతీయ స్థూల ఆర్థిక వాతావరణం సానుకూలంగా మారిందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ పేర్కొంటూ యూఎస్ వృద్ధి పటిష్ఠంగా ఉంటుందని, యూఎస్, ఇతర ఆసియా దేశాల్లో వడ్డీ రేట్ల కోతలు త్వరితంగా జరుగుతాయని, డాలరు విలువ మరింత తగ్గుతుందన్న అంచనాలు నెలకొన్నాయని వివరించింది. అక్టోబర్ కనిష్ఠస్థాయి నుంచి 15 శాతం ర్యాలీ జరపడం ద్వారా పలు సానుకూల అంశాల్ని మార్కెట్ పాక్షికంగా డిస్కౌంట్ చేసుకున్నప్పటికీ, మెరుగైన వృద్ధి, రేట్ల కోతల అంచనాలతో నిఫ్టీ ఇండెక్స్ టార్గెట్‌ను పెంచుతున్నట్టు గోల్డ్‌మాన్ తెలిపింది.

కార్పొరేట్ లాభాల్లో 20 శాతం వృద్ధి

భారత్‌లో కార్పొరేట్ లాభాలు ఈ ఏడాది కూడా రెండంకెల్లో వృద్ధిచెందుతాయని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అంచనా వేసింది. 2023లో ఎంఎస్‌సీఐ ఇండియా ఇండెక్స్‌లో ఉన్న కంపెనీల లాభాల వృద్ధి అంచనా 20 శాతంకాగా, 2024లో 15 శాతం, 2025లో 14 శాతం చొప్పున పెరుగుతాయని భావిస్తున్నట్టు తెలిపింది. వృద్ధి అన్ని రంగాల్లోనూ ఉంటుందని, కార్పొరేట్ల ఆదాయ, లాభాల వృద్ధితో రానున్న సంవత్సరాల్లో ఇండెక్స్ రాబడులు పెరుగుతాయని పేర్కొంది.

అమ్మకాల ఒత్తిడిలో మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. ఇంట్రాడేలో 680 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 30.90 పాయింట్లు అందుకొని 71,386.21 వద్దకు చేరుకోగా, నిఫ్టీ కూడా 31.95 పాయింట్లు ఎగబాకి 21,544.85 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 211.45 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. మార్కెట్లో లార్సెన్ అండ్ టుబ్రో షేరు 1.55 శాతం బలపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటర్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, నెస్లె, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.52 శాతం, పవర్ 1.10 శాతం, ఆటో 1.02 శాతం, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు మదుపరుల మద్దతు లభించింది. కానీ, ఎఫ్ఎంసీజీ, టెలికం, బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు నష్టపోయాయి.

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సుజుకీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ

భారత మార్కెట్ కీలకం

భారత్‌లో సెమికండక్టర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేదానిపై ప్రధానితో చర్చించాను. అహ్మదాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సనంద్ వద్ద 2.75 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సెమికండక్టర్ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నాం

- సంజయ్ మెహరోత్రా, మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్, సీఈవో

గాంధీనగర్, జనవరి 9: అంతర్జాతీయ కంపెనీల అధిపతులతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. వైబ్రాంట్ గుజరాత్ సమ్మిట్ ప్రారంభానికి ముందురోజే సుజుకీ మోటర్ కార్ప్, మైక్రాన్ టెక్నాలజీ, ఏపీ మోలర్ వంటి గ్లోబల్ సంస్థల సీఈవోలతో సమావేశమయ్యారు. ప్రధానంగా వీరు పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పెట్టుబడుల అవకాశాలపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తున్నది. మోదీతో సమావేశమైన అనంతరం సుజుకీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఆటోమొబైల్ రంగంలో భారత్ చాలా కీలకమైన మార్కెటని, దేశీయంగా తయారైన వాహనాలు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని, ఇక్కడే వాహన స్క్రాపింగ్, రీసైక్లింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో మారుతి సుజుకీ రెండో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. దీంతో సంస్థకు భారత్‌లో ఉన్న ప్లాంట్ల సంఖ్య ఐదుకి చేరుకోనున్నాయి.

12 వరకు వైబ్రాంట్ సమ్మిట్

ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజులపాటు గుజరాత్‌లో వైబ్రంట్ సమ్మిట్ జరగబోతున్నది. పెట్టుబడులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో జరుగుతున్న ఈ సదస్సుకు 133 దేశాలకు చెందిన లక్ష మంది హాజరయ్యే అవకాశాలున్నాయని నిర్వహకులు తెలిపారు.

మూడు రోజులకో టాటా స్టార్‌బక్స్ స్టోర్

ముంబై, జనవరి 9: ప్రీమియం కాఫీల విక్రయ సంస్థ టాటా స్టార్‌బక్స్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 390 స్టోర్లు ఉండగా..2028 నాటికి ఈ సంఖ్యను 1,000కి పెంచుకోనున్నట్టు ప్రకటించింది. అమెరికాకు చెందిన స్టార్‌బక్స్‌తో కలిసి టాటా గ్రూపు..ప్రతి మూడు రోజులకొక స్టోర్‌ను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నది. ముఖ్యంగా ఇప్పటికే మెట్రో నగరాలకు పరిమితమైన సంస్థ..ఇక నుంచి తన వ్యాపారాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించబోతున్నది. 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ అవతరించే అవకాశాలు ఉండటంతో అంతర్జాతీయ సంస్థలు ఇక్కడి మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. వచ్చే ఐదేండ్లలో స్టోర్ల సంఖ్యను 1,000కి పెంచుకోవడంలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు 8,600కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 71 శాతం ఎగబాకి రూ.1,087 కోట్లకు చేరుకున్నాయి.

వైట్ కాలర్‌కు గిరాకీ నై

డిసెంబర్‌లో 16 శాతం తగ్గిన హైరింగ్

ఆచితూచి అడుగులేస్తున్న ఐటీ, ఇతర రంగాలు

నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడి

ముంబై, జనవరి 9: దేశంలో వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు తగ్గుముఖం పట్టాయి. 2022 డిసెంబర్‌తో పోల్చితే 2023 డిసెంబర్‌లో 16 శాతం పడిపోయినట్టు తేలింది. ఐటీ, బీపీవో, విద్య, రిటైల్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లోని కంపెనీలు ఆచితూచి అడుగులు వేస్తుండటమే ఇందుకు కారణమని మంగళవారం విడుదలైన నౌకరీ.కామ్ సర్వే చెప్తున్నది. 'ఐటీ యేతర రంగాల్లో గత ఏడాది నవంబర్‌తో పోల్చితే డిసెంబర్‌లో నియామకాలు 2 శాతం పెరిగినట్టు మేము గమనించాం. అయితే ఐటీ రంగంలో ఈ రకమైన పరిస్థితులు లేవు. దీని వల్లే డిసెంబర్‌లో ఓవరాల్ ఇండెక్స్ 16 శాతం దిగజారింది. చూస్తుంటే ఐటీ రంగంలో హైరింగ్ తిరిగి పుంజుకోవాలంటే చాలా సమయమే పట్టేలా ఉన్నది' అని నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌ను విశ్లేషిస్తూ నౌకరీ.కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ అన్నారు.

ఇదీ సంగతి..

నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ వివరాల ప్రకారం 2022 డిసెంబర్‌తో పోల్చితే గత నెల బీపీవో రంగంలో 17 శాతం నియామకాలు తగ్గాయి. ఆ తర్వాత ఎడ్యుకేషన్, రిటైల్ రంగాల్లో 11 శాతం చొప్పున హైరింగ్ కార్యకలాపాలు నీరసించాయి. హెల్త్‌కేర్ రంగంలోనూ 10 శాతం కొత్త ఉద్యోగ నియామకాలు పడిపోయినట్టు స్పష్టమైంది. ఇక ఐటీ రంగంలో అత్యధికంగా 21 శాతం హైరింగ్ యాక్టివిటీస్ క్షీణించాయి. 2023 నవంబర్‌తో చూసినా 4 శాతం తగ్గాయి. దేశ, విదేశీ ఆర్థిక వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న ప్రతికూల మార్పులు.. ఆయా రంగాల్లోని హైరింగ్ కార్యకలాపాలకు బ్రేక్ వేస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా అమెరికా, ఐరోపాల్లో భారతీయ ఐటీ సంస్థలకు తగ్గిన ప్రాజెక్టుల ప్రభావం.. జాబ్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తున్నట్టు వారు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే 2023లో ఐటీ రంగానికి గడ్డు కాలం నడిచిందని, కేవలం 700 ఉద్యోగాలే పెరిగాయని గుర్తుచేస్తున్నారు. 2022లో ఏకంగా 2.67 లక్షల ఉద్యోగ నియామకాలు జరిగాయని చెప్తున్నారు. ఆయా సంస్థలు చేపట్టిన లేఆఫ్‌లు.. హైరింగ్ సెంటిమెంట్‌ను బాగా దెబ్బతీశాయన్న అభిప్రాయాలూ గట్టిగా వినిపిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు వినియోగం పెరుగుతుండటంతో కంపెనీలు మ్యాన్ పవర్‌ను తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఇండస్ట్రీ నిపుణులు ప్రస్తుత పరిస్థితుల్ని విశ్లేషిస్తున్నారు.

ఈ రంగాల్లో దూకుడు..

డాటా సైంటిస్టులు, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీర్లు, ఆటోమేషన్ ఇంజినీర్లకు గిరాకీ బాగుందని తాజా సర్వే వెల్లడించింది. ఐటీ ఇండస్ట్రీలో నియామకాలు అరకొరగా ఉన్నా.. ఇక్కడ మాత్రం హైరింగ్ పెద్ద ఎత్తున సాగుతున్నదని చెప్పింది. అయితే చమురు, గ్యాస్ రంగంలో కొత్త ఉద్యోగావకాశాలు ఆశించిన స్థాయిలో లేవన్న నౌకరీ.కామ్.. ఆతిథ్య రంగంలో మాత్రం 4 శాతం పెరిగినట్టు తెలిపింది. ఈ రంగంలో ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో ఉద్యోగ వృద్ధి బాగున్నది. ఇక ఔషధ రంగంలోనూ హైరింగ్ 2 శాతం పెరగగా.. అహ్మదాబాద్, వడోదర, ముంబైల్లో గరిష్ఠ వృద్ధి కనిపించింది.

హైదరాబాద్‌లో డౌన్

హైదరాబాద్‌లో గత నెల హైరింగ్ కార్యకలాపాలు మందగించినట్టు ఈ సందర్భంగా నౌకరీ.కామ్ తెలియజేసింది. డిసెంబర్‌లో ఆయా రంగాల్లో ఉద్యోగ నియామకాలు 23 శాతం పడిపోయినట్టు ప్రకటించింది. నిజానికి కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్ర ఐటీ రంగం కొత్త పుంతలు తొక్కిన విషయం తెలిసిందే. ఐటీ ఎగుమతుల్లోనూ బెంగళూరుకు గట్టి పోటీనిచ్చిన సంగతీ విదితమే. ఆఫీస్ స్పేస్‌లో, యువకుల్లో నైపుణ్యం-ప్రతిభకు సంబంధించైనా, ప్రభుత్వం తరఫున అందే మద్దతులోగానీ లోటన్నదే లేదు. దీంతోనే ఇక్కడి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు దక్కాయి. ఇది యావత్తు పరిశ్రమే అంగీకరించింది. అయితే కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తొలి నెలే.. ఉద్యోగ నియామకాల్లో ఈ క్షీణత ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని దక్కించుకోగా.. అంతకుమించి అటు మార్కెట్, ఇటు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నది.

రూ.50 లక్షల కోట్లకు ఫండ్స్ ఆస్తులు

న్యూఢిల్లీ, జనవరి 9: దేశంలోని మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ కింద ఉన్న ఆస్తులు (ఏయూఎం) తొలిసారిగా రూ.50 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి. 2023 డిసెంబర్‌లో ఇవి రూ.50.77 లక్షల కోట్లకు చేరాయి. నవంబర్‌లో ఫండ్స్ ఏయూఎం రూ.49.04 కోట్లు. ఫండ్స్ నిర్వహించే ఈక్విటీ స్కీములోకి డిసెంబర్ నెలలో రూ.16,997 కోట్లు తరలివచ్చాయి. ఈ స్కీమ్‌లోకి నవంబర్‌లో వచ్చిన రూ.15,536 కోట్లతో పోలిస్తే డిసెంబర్‌లో 9.40 శాతం వృద్ధిచెందాయి. మరోవైపు డిసెంబర్‌లో ఫండ్స్ నిర్వహణలోని డెట్ స్కీమ్‌ల నుంచి భారీగా రూ.75,556 కోట్లు తరలివెళ్లాయి. ఇందులో అత్యధికంగా లిక్విడ్ ఫండ్స్ నుంచి రూ.39,675 కోట్లను ఇన్వెస్టర్లు వెనక్కు తీసుకున్నారు. హైబ్రిడ్ ఫండ్ క్యాటగిరీ స్కీమ్‌లోకి మాత్రం రూ.15,009 కోట్లు వచ్చాయి. ఆర్బిట్రేజ్ ఫండ్స్ రూ.10,645 కోట్లు ఆకర్షించాయి. మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్స్‌లోకి రూ.2,420 కోట్లు, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్‌లోకి రూ.1,369 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డెట్, హైబ్రిడ్ ఫండ్స్ నుంచి పెద్ద మొత్తంలో నిధులు తరలివెళ్లినప్పటికీ, ఈక్విటీ మార్కెట్ జరిపిన భారీ ర్యాలీ కారణంగా ఈక్విటీ స్కీముల నికర ఆస్తుల విలువ పెరగడంతో ఫండ్స్ మొత్తం ఆస్తుల్లో వృద్ధి సాధ్యపడింది.

భారత్ వృద్ధి 6.4 శాతం

ప్రపంచ బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6.4 శాతం వృద్ధి సాధిస్తుందని, 2025-26లో ఇది 6.5 శాతానికి పుంజుకుంటుందని ప్రపంచ బ్యాంక్ తాజా అంచనాల్లో పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 6.3 శాతం వృద్ధిచెందుతుందని అంచనా వేసింది. అయితే గత ఏడాది జూన్‌లో ప్రకటించిన అంచనాలనే యథాతథంగా అట్టిపెట్టింది. బ్యాంక్ గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్ మంగళవారం విడుదల చేసింది. పటిష్ఠమైన సర్వీసుల రంగం, పెట్టుబడులు మద్దతుగా నిలుస్తున్నందున వేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన హోదాను నిలుపుకుంటుందని రిపోర్ట్‌లో వివరించింది. బ్యాంకింగ్ రంగంతో సహా కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్స్ మెరుగయ్యాయని, అధిక ప్రభుత్వ పెట్టుబడులు ఊతమిస్తున్నాయని తెలిపింది.



ప్రపంచ బ్యాంక్ వృద్ధి అంచనాలు (శాతం)

	2023	2024	2025
ప్రపంచం	2.6	2.4	2.7
ధనిక దేశాలు	1.5	1.2	1.6
వర్ధమాన దేశాలు	4	3.9	4
అమెరికా	2.5	1.6	1.7
చైనా	6.3	6.4	6.5

ఆర్థికాభివృద్ధి 6.2 శాతం: యూబీఎస్

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం వృద్ధి సాధించవచ్చని విదేశీ బ్రోకరేజ్ యూబీఎస్ అంచనా వేసింది. అంతర్జాతీయ సవాళ్లున్నా, రానున్న ఆర్థిక సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ 6.2 శాతం వృద్ధితో 3.9 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని, ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది 7 శాతం వృద్ధితో 3.57 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని యూబీఎస్ చీఫ్ ఎకనామిస్ట్ తన్వీ గుప్తా జైన్ ఒక తాజా నోట్‌లో వివరించారు. వ్యవస్థలో మూలధన పెట్టుబడులు పెరుగుతాయని, ప్రభుత్వ పెట్టుబడుల కాస్త తగ్గినా, ఎన్నికల తర్వాత ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడులు అధికంగా ఉంటాయని జైన్ పేర్కొన్నారు. 2025-26 నుంచి 2029-30 వరకూ భారత్ మధ్యకాలికంగా 6.5 శాతం చొప్పున వృద్ధిచెందుతుందని, జీడీపీ 6 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉన్నదని తెలిపారు.